నమస్తే తెలంగాణ
మహబూబ్‌నగర్
నారాయణపేట
5 | మహబూబ్‌నగర్, శనివారం 27 జనవరి 2024 | MAHABUBNAGAR NARAYANPET

నారాయణపేట జిల్లా కేంద్రంలో జెండాకు వందనం చేస్తున్న కలెక్టర్ శ్రీహర్ష, చిత్రంలో అధికారులు, జెడ్పీచైర్‌పర్సన్, ఎమ్మెల్యే

వనపర్తి జిల్లాకేంద్రంలో పోలీసుల గౌరవవందనం స్వీకరిస్తున్న కలెక్టర్ తేజస్ నందలాల్‌పవార్

నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలో జెండాకు సెల్యూట్ చేస్తున్న కలెక్టర్ ఉదయ్‌కుమార్, అధికారులు

నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలో చిన్నారుల నృత్య ప్రదర్శన

గణంగా.. తిరంగా..

జోగుళాంబ గద్వాల జిల్లా కేంద్రంలో జెండాకు వందనం చేస్తున్న కలెక్టర్ సంతోష్, చిత్రంలో అధికారులు, ఎమ్మెల్యేలు

మహబూబ్‌నగర్‌లో జెండాకు సెల్యూట్ చేస్తున్న కలెక్టర్ రవినాయక్

- ఉమ్మడి జిల్లాలో గణతంత్ర వేడుకలు
- రెపరెపలాడిన త్రివర్ణ పతాకం
- జాతీయజెండాను ఆవిష్కరించిన కలెక్టర్లు, ఎస్పీలు, అధికారులు, ప్రజాప్రతినిధులు
- ఆకట్టుకున్న చిన్నారుల ప్రదర్శనలు
- స్వాతంత్ర్య సమరయోధులు, అమరవీరుల కుటుంబాలకు సన్మానాలు
- ఉత్తమ ప్రతిభ కనబర్చిన వారికి ప్రశంసా పత్రాలు అందజేత

ఢిల్లీ శకటోత్సవంలో తూంకుంట వాసి

వీపనగండ్ల, జనవరి 26 : మండలంలోని తూంకుంట గ్రామానికి చెందిన కిష్టమ్మ, కాశన్న కూతురు బోరెల్లి జ్యోతి గణతంత్ర వేడుకల్లో తెలంగాణ నుంచి చోటు దక్కించుకున్నది. ఢిల్లీ శకటోత్సవంలో తెలంగాణ ఐలమ్మ, కొమురంభీం వేషధారణలో.. తెలంగాణ గుండె శబ్దానికి కణకణ మోగే మృదంగ నాట్యం ఆడుతూ ప్రజాస్వామ్య యోధులు థీమ్‌తో ప్రదర్శన ఇచ్చింది. బోరెల్లి జ్యోతి పొట్టి శ్రీరాములు యూనివర్సిటీలో జానపద ఎంఏ పూర్తి చేసి.. ప్రస్తుతం ఎంఏ తెలుగు అభ్యసిస్తున్నది. ఈమె సామాజిక స్పృహ కవిత్వం రాయడంలో దిట్ట, 2015, 2020లో తెలంగాణ శకటం వేడుకల్లో పాల్గొన్నారు.

వనపర్తిలో..

మహబూబ్‌నగర్‌లో..

మహబూబ్‌నగర్‌లోని డీఐజీ కార్యాలయంలో జెండాకు వందనం చేస్తున్న జోగుళాంబ జోన్ డీఐజీ ఎల్ఎస్ చౌహాన్

ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా వ్యాప్తంగా శుక్రవారం గణతంత్ర దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. జిల్లా కేంద్రాల్లో కలెక్టర్లు రవినాయక్, కోయ శ్రీహర్ష, తేజస్‌నంద లాల్ పవార్, సంతోష్, ఉదయ్‌కుమార్ జెండాకు సెల్యూట్ చేశారు. పరేడ్‌గ్రౌండ్లలో పోలీసుల గౌరవవందనం స్వీకరించారు. అనంతరం స్వాతంత్ర్య సమరయోధులను సన్మానించారు.

ఉత్తమ ప్రతిభ కనబర్చిన వారికి ప్రశంసాపత్రాలు అందజేశారు. చిన్నారుల ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ఆయా జిల్లాల్లో అధికారులు, ఎమ్మెల్యేలు, మంత్రులు, మాజీ మంత్రులు, మాజీ ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు జాతీయ జెండాలను ఎగురవేశారు. దీంతో వాడవాడనా త్రివర్ణ పతాకం రెపరెపలాడింది.

- నెట్‌వర్క్ (నమస్తే తెలంగాణ), జనవరి 26

మహబూబ్‌నగర్‌లో..

నాగర్‌కర్నూల్‌లో..

గద్వాలలో..

వనపర్తిలో..

జోగుళాంబ గద్వాల జిల్లా కేంద్రంలోని క్యాంప్ కార్యాలయంలో జెండావిష్కరణ చేస్తున్న గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి

ఉండవెల్లి మండలంలోని క్యాంప్ కార్యాలయంలో జాతీయ జెండాకు సెల్యూట్ చేస్తున్న అలంపూర్ ఎమ్మెల్యే విజయుడు

మహబూబ్‌నగర్ నమస్తే తెలంగాణ యూనిట్ కార్యాలయంలో జాతీయ జెండాకు సెల్యూట్ చేస్తున్న బ్రాంచ్ మేనేజర్ రాజశేఖర్, బ్యూరో ఇన్‌చార్జి వెంకటేశ్వర్‌రావు, ఎడిషన్ ఇన్‌చార్జి నరేశ్‌కుమార్, అన్ని విభాగాల హెచ్‌వోడీలు, సిబ్బంది

అసత్య ప్రచారాలతోనే ఓటమి

- సోషల్ మీడియా ప్రచారంలో బీఆర్ఎస్ వెనుకంజ
- కేసీఆర్‌ను ఓడించడానికి 70 యూట్యూబ్ చానళ్లు పనిచేశాయి
- మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి
- నాగర్‌కర్నూల్ పార్లమెంట్ నియోజకవర్గ సోషల్ మీడియా వారియర్స్ సమావేశం

వనపర్తి, జనవరి 26 : బీఆర్ఎస్ పార్టీ ఓటమి సోషల్ మీడియాలో వ్యతిరేక ప్రచారం వల్లే జరిగిందని మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి ఉద్ఘాటించారు. శుక్రవారం బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో నిర్వహించిన నాగర్‌కర్నూల్ పార్లమెంట్ నియోజకవర్గ సోషల్ మీడియా వారియర్స్ సమావేశంలో మాజీ పార్లమెంట్ సభ్యుడు రావుల చంద్రశేఖర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు గువ్వల బాలరాజు, బీరం హర్షవర్ధన్‌రెడ్డితో కలిసి మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి మాట్లాడుతూ కేసీఆర్ తన పదేండ్ల పాలనలో రాష్ట్రాన్ని నిధులు, నీళ్లు, నియామకాల పేరిట అద్భుత అభివృద్ధితో తెలంగాణను ప్రపంచ పటంలో నిలిపారన్నారు. అనేక సంక్షేమ పథకాలకు రూపకల్పన చేసిన కేసీఆర్‌పై కేవలం సోషల్ మీడియాలో లేనిపోని దుష్ప్రచారం వల్లే వెనుకబడి ఓడిపోవటానికి కారణమైందన్నారు. ఒక్క కేసీఆర్‌ను ఓడించడానికి రాష్ట్రంలో 70 యూట్యూబ్ చానళ్లు ఐదేండ్లు కష్టపడ్డాయని తెలిపారు. ఆధునిక కాలంలో నిజం నిలబడే లోపు అబద్ధం ప్రపంచాన్ని చుట్టుముడుతుందనే నానుడి నిజమన్న విషయాన్ని సోషల్ మీడియా వారియర్స్ గుర్తించాలన్నారు. సోషల్ మీడియా ప్రతినిధులను తిరుగులేని శక్తిగా మార్చి కాంగ్రెస్ 420 గ్యారెంటీలను ప్రజల్లోకి తీసుకెళ్తామన్నారు. వారు చేసిన అసత్య ఆరోపణలు ఎప్పటికప్పుడు తిప్పికొట్టేందుకు సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. దీనికి మొట్టమొదట ఈ ప్రక్రియను నాగర్‌కర్నూల్ పార్లమెంట్ నియోజకవర్గం నుంచే నాంది పలుకుదామని చెప్పారు. నియోజకవర్గాల వారీగా సోషల్ మీడియా వారియర్స్ సమావేశాలు నిర్వహించి వ్యవస్థను పటిష్టంగా చేస్తామన్నారు. సమావేశంలో బీఆర్ఎస్ నేత రంగినేని అభిలాష్‌రావు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్నమా జీ మంత్రి సింగిరెడ్డిని రంజన్‌రెడ్డి

దైవ దర్శనానికి వెళ్తూ తల్లీకొడుకు మృతి

- భర్త, కుమార్తెకు గాయాలు
- కొత్తకోటలో విషాద ఛాయలు

కొత్తకోట, జనవరి 26 : షిరిడి సాయి దర్శనానికి వెళ్తున్న రెండు కుటుంబాల్లో విషాద ఛాయలు అలుముకున్నాయి. కొత్తకోట పట్టణానికి చెందిన కృష్ణ అతడి భార్య వసుధ (30), కూతురు లావ్య, కుమారుడు శ్రీమన్(3)తో పాటు కర్నూల్ జిల్లా డోన్‌కు చెందిన వెంకట్రాములు, రోజారమణి, వారి కుమారుడు ప్రవీణ్ (26)లు కలిసి షిరిడికి డోన్ నుంచి గురువారం ఉదయం బయలుదేరారు. వీరితోపాటు కృష్ణ కుటుంబ సభ్యులు మార్గమధ్యంలో హైదరాబాద్‌లో వారు వెళ్తున్న కారులో కలిసి వెళ్లారు. శుక్రవారం తెల్లవారు జామున ముందు వెళ్తున్న లారీని షిరిడి సమీపంలోని వైకాస్‌పూర్ వద్ద వారి కారు ఢీకొట్టింది. దీంతో వసుధ, ప్రవీణ్ అక్కడికక్కడే మృతి చెందగా, శ్రీమన్ దవాఖానలో చికిత్స పొందుతూ మృతి చెందారు. కృష్ణ, కుమార్తె లావణ్యతోపాటు వెంకట్రాములు, రోజారమణి తీవ్రంగా గాయపడి ఓ ప్రైవేట్ దవాఖానలో చికిత్స పొందుతున్నారు. కొత్తకోటకు చెందిన తల్లి, కుమారుడు షిరిడి వెళ్తూ మృతి చెందడంతో పట్టణంలో విషాద ఛాయలు అలుముకున్నాయి.

మృతి చెందిన వసుధ, శ్రీమన్ (ఫైల్)

రెండు బైక్‌లు ఢీ : ఒకరు మృతి

- ఒకరికి తీవ్ర గాయాలు

కొత్తకోట, జనవరి 26 : మండలంలోని ముమ్మళ్లపల్లి గ్రామ సమీపంలో 44వ జాతీయ రహదారిపై రెండు బైకులు ఢీకొట్టిన ఘటనలో ఒకరు మృతి చెందగా మరొకరు గాయపడినట్లు ఎస్సై మంజునాథ్ రెడ్డి తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం గురువారం రాత్రి వనపర్తి మండలం కడుకుంట్ల గ్రామానికి చెందిన చందుకుమార్(19) బోయ వెంకటేశ్‌తో కలిసి బైక్‌పై కొత్తకోటకు జెండా కాగితాలు తీసుకురావడానికి వెళ్తుండగా ఎదురుగా వస్తున్న బైక్ వీరి బైక్‌ను ఢీకొట్టింది. దీంతో చందుకుమార్ అక్కడికక్కడే మృతి చెందగా వెంకటేశ్‌కు తీవ్ర గాయాలయ్యాయి. గాయపడిన వ్యక్తిని 108లో వనపర్తి ఏరియా దవాఖానకు తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

కుంటలో పడి గొర్రెలకాపరి మృతి

బిజినేపల్లి, జనవరి 26 : ప్రమాదవశాత్తు కుంటలోపడి గొర్రెలకాపరి మృతిచెందిన ఘటన మండలంలోని వడ్డెమాన్‌లో శుక్రవారం చోటుచేసుకున్నది. స్థానికుల కథనం మేరకు.. వడ్డెమాన్‌కు చెందిన కుమ్మరి మైబు(32) గొర్రెలను మేతకు తీసుకెళ్లాడు. మధ్యాహ్నం గ్రామ సమీపంలోని రచ్చలకుంట వద్దకు నీళ్లు తాపేందుకు వెళ్లగా, ప్రమాదవశాత్తు కాలుజారి కుంటలోపడి మృతిచెందినట్లు తెలిపారు. చుట్టుపక్కల వారు గమనించి బయటకు తీశారు. మృతుడికి భార్య బాలమణితోపాటు ముగ్గురు సంతానం ఉన్నారు.